క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: బుధవారం ఉదయం ఆరు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎస్ కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో నున్న 220 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ ఆధునికీకరణలో భాగంగా సాంకేతిక మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో గుడివాడ ఉప విద్యుత్ కేంద్రం, పామర్రు-2 ఫీడర్, కానుమోలు ఫీడర్లలో సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. సాధారణ సరఫరాలో అంతరాయం ఉండబోదని తెలిపారు.

అభయాంజనేయస్వామికి సిందూర అలంకారం



పామర్రు: స్థానిక అంకమ్మ తల్లి ఆలయంలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామిని మంగళవారం సిందూరంతో అలంకరించారు. తొలుత స్వామికి పంచామృతాలతో విశేషంగా అభిషేకాలను చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వరదా అప్పారావు, సభ్యులు కాటూరి వెంకట మురళీకృష్ణ పాల్గొన్నారు.

రూ.50 వేల విలువైన సిమెంట్ బల్లల వితరణ



పమిడిముక్కల: మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన ఉపసర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు యార్లగడ్డ శివనాగమల్లేశ్వరరావు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రూ.50 వేలతో 10 సిమెంట్ బల్లలు తయారు చేయించి వాటిని గ్రామంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ప్రజలు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా ముఖ్య కూడళ్లలో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసినట్లు శివ తెలిపారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించండి



కురుమద్దాలి(పామర్రు): గ్రామాల్లో చెత్త సేకరణ పనులు సక్రమంగా నిర్వహించి చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని కురుమద్దాలిలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె నిద్రలో భాగంగా గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నామన్నారు. అనంతరం గ్రామంలో చెత్త సేకరణ వాహనాన్ని కొంత దూరం నడిపారు. కార్యక్రమంలో స్థానిక డీసీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి అంజనాదేవి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవాలు



గుడ్లవల్లేరు: కౌతవరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ దేవస్థానం, శ్రీ గంగా పార్వతీ సమేత గౌతమేశ్వరాలయం, గుడ్లవల్లేరు శ్రీ రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాల స్వామిర ఆలయం, వెణుతురుమిల్లి శ్రీ రామలింగేశ్వర స్వామివారి ఆలయం, శ్రీ కోదండ రామస్వామివారి ఆలయాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారం కొనసాగాయి. ఈ వార్షికోత్సవాల్లో భాగంగా బిందె తీర్థం, కొట్నాలు, నిత్యార్చన నిర్వహించారు.

మజ్జిగ పంపిణీ



గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక బంటుమిల్లి రోడ్‌లో సేవాసంస్థకు చెందిన చంద్రశేఖర్, పవన్‌ల సౌజన్యంతో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. అధ్యక్షుడు ఎ. గోపిరెడ్డి, ఉపాధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, చైర్మన్ వేణుగోపాలరావు, ఎస్.జమలయ్య పాల్గొన్నారు.

■ ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కెనరా బ్యాంక్ వద్ద మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. అధ్యక్షుడు కోనా రామారావు, కార్యదర్శి డి. శ్రీనివాసరావు, కోశాధికారి టి. రామ్మోహనరావు, బి. కుటుంబరావు, ఎల్ఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన కల్పించండి



దానిగూడెంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ఏలూరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శారద

కైకలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలికల హక్కులపై మహిళలు, యువతులకు అవగాహన కల్పించి, ప్రచారం చేయాలని ఐసీడీఎస్ ఏలూరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.శారద సూచించారు. కైకలూరు పంచాయతీ దానిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో వేసవి ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో భాగంగా కిశోర వికాసం 2.0కు ప్రత్యేక అతిథిగా ఆమె మంగళవారం విచ్చేశారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ బాలికలకు పిల్లల హక్కులు, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధం, విద్యా ప్రాముఖ్యత తదితర అంశాలను తెలియజేయాలన్నారు. సీడీపీఓ డాక్టర్ వి.దీప్తి, మహిళా సంరక్షణ కార్యదర్శి సీహెచ్ ఉమా, ఏఎన్ఎం వై.రజనీకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ యు.భార్గవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: కిశోర బాలికలు తమ రక్షణకు ఉపయోగపడే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పురిటిపాడు ఎంఎస్‌కే షేక్ షకీల అన్నారు. పురిటిపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం చట్టాలపై అవగాహనా సదస్సును నిర్వహించారు. బాలల లైంగిక వేధింపులను నిర్మూలించేందుకు పోక్సో చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. 18ఏళ్ల లోపు ఆడ పిల్లలపై లైంగిక దాడులు జరిగితే 20ఏళ్ల జైలుతో పాటు రూ.లక్ష జరిమానా విధించడమే ఈ చట్టం ముఖ్యోద్దేశమన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

పమిడిముక్కల: బాల్య వివాహాలు చేసుకోవడం వలన అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని, 18 సంవత్సరాలలోపు పిల్లలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉష తెలిపారు. మేడూరు సచివాలయంలోని ముత్రాసిపాలెం అంగనవాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కులు, రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఎంఎస్‌కే అనూష, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు,

గుర్రాలంకలో..

గుర్రాల్లంక అంగనవాడీ కేంద్రంలో మంగళవారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన వీడియోను ప్లే చేసి చూపించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సునీత, ఎంఎస్‌కే స్రవంతి, ఏఎన్ఎం లక్ష్మి, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెనమకూరులో అవగాహన కల్పిస్తున్న నాగమల్లేశ్వరి

మొవ్వలో..

కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజ-7వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసం -వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ లీగల్ కం ప్రొబిషన్ ఆఫీసర్ వి.శైలజ, మొవ్వ సెక్టార్ సూపర్‌వైజర్ ఏనుగు పుణ్యవతి, వాసవీ మహిళా మండలి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి, మహిళా పోలీస్ కే రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: లోకుమూడి పంచాయతీ పరిధిలో కిశోర బాలికలకు సమావేశం ఏర్పాటు చేసి, బాల్య వివాహాలు నిషేధంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శారద, సీడీపీఓ దీప్తి విచ్చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఆశా వర్కర్, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.



పురిటిపాడులో కిశోర బాలికలకు అవగాహన

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై జాగ్రత్త వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి సూచించారు. కిశోర వికాశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెనమకూరు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

17 నుంచి వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు

పెదసనగల్లు(మొవ్వ): మొవ్వ మండలం పెదసనగల్లులోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు సూరపునేని గంగా భవాని పేర్కొన్నారు. 17న అంకురార్పణ, అగ్ని ప్రతిష్టతో ప్రారంభమై 18న చతుర్దశ కలశస్నపన, శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. 19న శ్రీ లక్ష్మీ నరసింహహోమం, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, కల్యాణమూర్తుల గ్రామోత్సవం , 20న చక్రస్నానం, ద్వాదశప్రదక్షిణలు, పవళింపు సేవలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

రోడ్డు వేయొద్దని నాగాపురం గ్రామస్తుల ఆందోళన



నాగాపురంలో సీసీ రోడ్డు వేయవద్దని ఆందోళన చేస్తున్న సర్పంచ్ నాగదేశిసుబ్రహ్మణ్యం, గ్రామస్తులు

నాగాపురం(పెదపారుపూడి): పల్లె పండుగలో భాగంగా ఎస్ఆర్‌జీఎస్ నిధులతో ఉపయోగం లేని రోడ్డు వేయవద్దని నాగాపురం సర్పంచ్ నాగదేశి సుబ్రమహ్మణ్యం ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్ఆర్‌జీఎస్ నిధుల నుంచి రూ.12 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. గ్రామంలో గంజి రంగారావు ఇంటి దగ్గర నుంచి రైల్వేస్టేషన్ వరకు రోడ్డు వేశారన్నారు. మరో 60 మీటర్ల రోడ్డు వేయాల్సి ఉండగా, పంచాయతీ రాజ్ ఏఈ రామ్మోహనరావు, తన ఇష్టం వచ్చినట్లు నాగాపురం నుంచి పాములపాడు వెళ్లే జెడ్పీ రోడ్డులో పనులు మొదలు పెట్టారన్నారు. అయితే గ్రామస్తులు శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డుగాని, మరో మార్గంలో మిగిలిన 60 మీటర్లు సీసీ రోడ్డు వేయాలని ఏఈని కోరినా ఆయన ఒప్పుకోలేదన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామస్తులకు ఇష్టం లేని చోట రోడ్డు ఎట్లా వేస్తారని ఆందోళన చేపట్టినట్లు తెలిపారు.

నాసిరకంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు

గ్రామంలో కొత్తగా వేసిన సీసీ రోడ్డుకు నాలుగు నెలలకే పెద్ద పగుళ్ల వచ్చాయని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏఈ పర్యవేక్షణ లేకపోవటంతో ఇలా జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికైన జిల్లా స్థాయి అధికారులు స్పందించి గ్రామానికి వచ్చి రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించి క్వాలిటీ కంట్రోల్ అధికారులతో విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా పంచాయతీ రాజ్ ఏఈ రామ్మోహనరావుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించటం లేదని గ్రామస్తులు ఆరోపించారు.



కొత్తగా వేసిన రోడ్డుపై పగుళ్లను చూపుతున్న సర్పంచ్

సీబీఎస్ఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



బి. రోహిత్‌సాయి



బి. మంజునాథ్‌రెడ్డి

గుడివాడ టౌన్: సీబీఎస్ఈ విడుదల చేసిన ఫలితాల్లో 10, 12వ తరగతులకు చెందిన విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి వైజ్ ఉడ్ ఖ్యాతిని పెంచారని విశ్వభారతి వైజ్‌ఉడ్ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ మంగళవారం తెలిపారు. తమ విద్యా సంస్థలకు చెందిన బి. రోహిత్‌సాయి 10వ తరగతి ఫలితాల్లో 487/500, 12వ తరగతికి చెందిన బి.మంజునాథ్‌రెడ్డి 454/500 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను డైరెక్టర్‌లు ఆర్ మంజుల, ఆర్. ప్రణీత్ అభినందించారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరించిన నాయకులు

కలిదిండి(కైకలూరు): కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని, లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలనే డిమాండ్లతో ఈ నెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. కలిదిండి మండలం మూలలంకలో సమ్మె పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘం ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి మహంకాళిరావు, సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

ఆట పాటలతో మానసిక వికాసం



గుడ్లవల్లేరులో విద్యార్థులకు ఆట పాటలు నిర్వహిస్తున్న దృశ్యం

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించే ఆట పాటలతో మానసిక వికాసం వారిలో ఏర్పడుతుందని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి అన్నారు. మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు ఆట పాటలతో చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు.

జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలపై అవగాహన

మండవల్లి: గ్రంథాలయంలో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలపై లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీన పిల్లలకి మంగళవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ జనరల్ నాలెడ్జ్‌పై పట్టు సాధించడం వలన పిల్లలకు కాంపిటేటివ్ స్పిరిట్ పెరుగుతుందన్నారు. ఇది ఉద్యోగానికి తోడ్పడుతుందన్నారు. దీనికోసం రోజూ కొంత సమయాన్ని కేటాయించాలని కోరారు.



మండవల్లిలో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలపై అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్ పర్వీన



ముదినేపల్లిలో విద్యార్థులకు నీతి పద్యాలను వివరిస్తున్న లైబ్రేరియన్

విద్యార్థులకు నీతి పద్యాలు

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు నీతిపద్యాల గురించి మంగళవారం వివరించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో వేమన, సుమతీ శతకాల పద్యాలను చదివించి, వాటిలోని భావాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు.

ఆహ్వాన పత్రికలపై ప్రజాప్రతినిధుల పేర్లు ముద్రించరా?

ముదినేపల్లి రూరల్: దేవదాయశాఖ ఆధీనంలోని ఆలయాల్లో జరిగే కార్యక్రమాలకు సంబంధించి స్థానిక ప్రజా ప్రతినిధుల పేర్లు ముద్రించకపోవడంలోని అధికారుల ఆంతర్యం ఏమిటని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మోట్రు ఏసుబాబు అన్నారు. ముదినేపల్లిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయ కల్యాణోత్సవాలు ఇటీవల ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ ఆహ్వాన పత్రికల్లో స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, దేవదాయ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫొటోలతో పాటు దేవదాయశాఖ అధికారుల పేర్లను ముద్రించినట్లు చెప్పారు. ఈ తరువాత వరుసలో స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు, సర్పంచ్, ఎంపీటీసీల పేర్లు ముద్రించాల్సి ఉందన్నారు. వీరంతా వైఎస్సార్ సీపీకి చెందిన వారు కావడంతో ఆహ్వాన పత్రికల్లో వీరి పేర్లు ముద్రించలేదని విమర్శించారు. సంబంధిత అధికారులు ఇకనైనా ఇలాంటి పొరపాట్లు జరగకుండా ప్రజా ప్రతినిధులకు పార్టీతో నిమిత్తం లేకుండా ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

టిడ్కో లబ్ధిదారులను రుణ విముక్తులను చేయాలి



ధర్నా చేస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

గుడివాడ టౌన్: టిడ్కో కాలనీ ఏర్పాటులో భాగంగా లబ్ధిదారులు చెల్లించాల్సిన రుణాలను ప్రభుత్వం రద్దుచేసి రుణవిముక్తులను చేయాలని కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు డి మాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాలనీలో ధర్నా నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే రాము గత ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే పూర్తిగా రుణాలు రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు కాలనీలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌ను మంచినీటితో నింపడం లేదన్నారు. అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షురాలు రంగమ్మ, సభ్యులు ఇందిర, మేరమ్మ, శివరామ్‌ప్రసాద్, గణేష్, సుభాని,రాంబాబు,అప్పలనాయుడు, శాంతారామ్, అమ్మాజి, గాయత్రి, లక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ **సుబ్బారాయుడికి అభిషేకాలు**

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్.గంగా శ్రీదేవి పర్యవేక్షణ చేశారు.

■ **అన్న సమారాధన**

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు శ్రీపార్వతీ సమేత శ్రీసోమేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు స్థానిక ప్రముఖులు సమారాధన ప్రారంభించారు.

■ **పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం**

పామర్రు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని పామర్రు గ్రంథాలయాధికారి ఎం ఝాన్సీరాణి పేర్కొన్నారు. స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థి కుంభం తేజ పరిసరాలు-పచ్చదనం అనే అంశంపై డిబెట్ నిర్వహించారు.

జమీగొల్వేపల్లిలో..

గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో ఉపాధ్యాయిని ఎస్‌మాధవి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై అవగాహన తరగతులు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు వారు తయారు చేసిన పేపర్ క్రాఫ్ట్ కళాకృతులను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నాగ.సురేష్ పాల్గొన్నారు.

■ **రూ.7 లక్షలతో సీసీ రోడ్డు**

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌జీఈఎస్ నిధులు రూ.7 లక్షలతో తెలగాల రామాలయం వద్ద నుంచి చెన్నంశెట్టి సాంబశివరావు ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. విద్యుత్ స్తంభాలు వేయడానికి మిషన్ ద్వారా రంధ్రాలు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు పెరుమాళ్ల సత్యనారాయణ తెలిపారు.

■ **ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి**

మొవ్వ: గ్రామాల్లో మూడు సెంట్లు నివేశన స్థలాలకు మండలంలోని అర్హులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కే మస్తాన్ తెలిపారు. దరఖాస్తుదారులు తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి బీపీఎల్ కుటుంబానికి చెందినవారై ఉండాలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా సొంత ఇల్లు గానీ, స్థలం గానీ కలిగి ఉండరాదని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గతంలో ఎక్కడ నివేశన స్థలం పొంది ఉండరాదని పేర్కొన్నారు. గతంలో గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు పొంది ఉండరాదని తెలిపారు. అలాగే అర్జీదారుడు చెల్లుబాటు అయ్యే ఆధార్ కార్డు కలిగి ఉండాలని, వ్యవసాయ భూమి ఐదు ఎకరాలు మించి ఉండరాదని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నవారు మాత్రమే అర్జీలు అందజేయాలని తెలిపారు.

■ **స్వయం సంవృద్ధి సాధించేందుకు కృషి**

పామర్రు: వంట నూనెలలో స్వయం సంవృద్ధిని సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని కురుమద్దాలిలో పామాయిల్ సాగును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పామాయిల్ సాగుకు అనువైన మండలాలుగా పామర్రు, గుడివాడ, గుడ్లవల్లేరును ఎంపిక చేశారన్నారు. ఈ నేపథ్యం హార్టికల్చర్ డిపార్టుమెంట్, ఉండవల్లి ఆగ్రోస్ పామ్ ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో గ్రామంలో 20 ఎకరాల విస్తీర్ణంలో పామాయిల్ సాగుకు పునాది వేసినట్లు తెలిపారు. ఉద్యాన శాఖ అధికారులు మాట్లాడుతూ పామర్రు మండలంలో అనుకూలమైన వాతావరణం ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉండవల్లి ఆగ్రోస్ డీజీఎం బి హరికృష్ణ, ఏజీఎం శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి ఉద్యాన శాఖ అధికారి చందు జోసెఫ్ సుందరం, పామర్రు మండల ఉద్యాన శాఖ అధికారి కీర్తి పాల్గొన్నారు.

■ **ఘనంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు**

గుడివాడ టౌన్: పట్టణంలో బుద్ధ పూర్ణిమ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి బంటుమిల్లి రోడ్‌లోని బౌద్ధ స్థూపం వరకు జాతీయ జెండాలు పట్టుకుని భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు, గుత్తా చంటి, స్టేడియం కమిటి సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాదు, పర్వతనేని ఆనంద్, వి. దుర్గారావు, రామకృష్ణ, దినకర్, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

■ **హైస్కూల్‌కు రూ. 25 వేలు వితరణ**

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్ లోని ఎస్‌జీఆర్‌కే (టౌన్) మున్సిపల్ హైస్కూల్‌కు ఉప్పల ప్రత్యుష్‌బాబు రూ. 25 వేలు వితరణగా మంగళవారం అందజేశారు. పాఠశాల్లో సైన్స్ ల్యాబ్ పరికరాలు, ఇనుప బీరువా వంటివి కొనుగోలుకు ఈ మొత్తాలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. పాఠశాల హెచ్ఎం డి. శ్రీనివాసన్, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

■ **దరఖాస్తుల ఆహ్వానం**

తోట్లవల్లూరు: స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్తల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ హరిదుర్గా నాగేశ్వరరావు తెలిపారు. దేవదాయ కమిషనర్ ఆదేశాల మేరకు ధర్మకర్తల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు 20 రోజుల వ్యవధిలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

■ **ప్రతిభగల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు**

పామర్రు: పదో తరగతిలో నియోజకవర్గంలోని ఐదు మండలాల స్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణిలో విజేతలైన విద్యార్థులకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా నగదు పురస్కారాలను అందజేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పామర్రు మండలం ప్రథమ స్థానం సాధించిన ఊర్వకు రూ.5వేలు, ద్వితీయ స్థానం సాధించిన హర్షిణికి రూ.4వేలు, తృతీయ స్థానం సాధించిన కూనపరెడ్డి సుష్మ మైత్రేయికి రూ.3వేలు చొప్పున అందజేశామన్నారు. అదే విధంగా నియోజకవరగంలోని తోట్లవల్లూరు, పమిడిముక్కల, మొవ్వ, పెదపారుపూడి మండలాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి నగదు పురస్కారాలను అందజేశారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన పమిడిముక్కల మండలానికి చెందిన విద్యార్థినికి రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరి పల్లి గణేష్, డీసీ చైర్మన్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.